ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 6 సెప్టెంబరు 2024



నేడు మీకోసం కార్యక్రమం రద్దు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 5: జిల్లాలోని కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. 'మీ కోసం' కార్యక్రమాన్ని 6న రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సహాయక చర్యల విధుల్లో ఉన్నందున ఈ వారం 'మీకోసం రద్దు చేశా మని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. మళ్లీ ఈ నెల 13న యథావిధిగా కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తదితరులు

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- 78 మంది ఉత్తమ గురువులకు సన్మానం

అరసవల్లి, సెప్టెంబరు 5: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని అంబేడ్కర్ కళావేదికలో గురువారం 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'నాలోని ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడానికి ఉపాధ్యాయులే కారణం. విద్యతో పాటు విలువలు, ఆటల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజెప్పే బాధ్యత ఉపాధ్యాయులదే. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల'ని కోరారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ భావి తరాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత విలువైనదన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలని, అందులో ఉపాధ్యాయులే కీలకమన్నారు. గురువుకు గల ప్రాధాన్యం సమాజంలో మరెవరికీ లేదన్నారు. డీఈవో తిరుమల చైతన్య మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం డా.నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థినులు పలు నృత్య రూపకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మీ కుమారుడు.. డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నాడంటూ..

- గురుపూజోత్సవం రోజు ఉపాధ్యాయుడికి సైబర్ నేరగాళ్ల ఝలక్
- పోలీసులమని చెప్పి.. రూ.1.90 లక్షలు కాజేశారు

పలాస, సెప్టెంబరు 5: 'మీ కుమారుడు డ్రగ్స్‌తో మాకు పట్టుబడ్డాడు. ఆయన్ను విడిచిపెట్టాలంటే మేము అడిగిన డబ్బులు మా ఖాతాలో జమ చేయాలి' అని ఓ ఉపాధ్యాయుడికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. హిందీలో సంభాషించాడు. ఆ ఉపాధ్యాయుడు ఆందోళన చెంది.. ఆయన అడిగినంత డబ్బులు విడతల వారీ రూ.1.90 లక్షలు ఆన్‌లైన్‌లో జమ చేశారు. దీనిపై మరో ఉపాధ్యాయుడుకి అనుమానం వచ్చి ప్రశ్నించగా.. అవతలి వ్యక్తి ఫోన్‌లో స్పందించలేదు. కుమారుడికి ఫోన్ చేయగా క్షేమంగానే ఉన్నట్టు తెలిసింది. దీంతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తాను మోసపోయానని గ్రహించి.. ఆ ఉపాధ్యాయుడు పోలీసులను ఆశ్రయించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. చిన్నబడాంలోని ఓ ఉపాధ్యాయుడు కుమారుడు.. ఒడిశాలో ఐఐటీ చదువుతున్నాడు. గురువారం ఆ ఉపాధ్యాయుడు.. ఉపాధ్యాయ దినోత్సవంలో బిజీగా ఉండగా.. అపరిచిత వ్యక్తి నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. ట్రూకాలర్‌లో పరిశీలించగా.. ఆ అపరిచిత వ్యక్తి పోలీసు డ్రస్‌లో కనిపించడంతో ఉపాధ్యాయుడు ఆందోళన చెందుతూ ఫోన్ లిఫ్ట్ చేశారు. 'మీ కుమారుడు డ్రగ్స్‌తో మాకు దొరికిపోయాడు. ఈ కేసు నుంచి బయట పడాలంటే మాకు కొంత మొత్తం కావాల'ని అపరిచిత వ్యక్తి ఫోన్‌లో డిమాండ్ చేశారు. దీన్ని విశ్వసించని ఆ ఉపాధ్యాయుడు ఫోన్‌లో ఆయనకు సమాధానం ఇస్తుండగానే కొత్త సీన్ క్రియేట్ చేశారు. పోలీసు సైరన్ వినిపించడంతో పాటు.. అక్కడ హడావుడి జరుగుతున్నట్లు శబ్దాలు రావడంతో ఆ ఉపాధ్యాయుడు నిజమైన పోలీసులేనని భావించాడు. ఇప్పుడు తనను ఏం చేయమంటారని అడగ్గా.. తమకు డబ్బులు కావాలని అపరిచిత వ్యక్తి చెప్పాడు. ఈ క్రమంలో రూ.5వేల నుంచి ప్రారంభించి.. రూ.40వేల వరకు రెండు గంటల సమయంలో దఫదఫాలుగా రూ.1.90 లక్షల వరకు ఆయన చెప్పిన బ్యాంకు ఖాతాల్లో ఉపాధ్యాయుడు జమ చేశారు. ఆయన ఖాతాలో డబ్బులు లేకపోవడంతో.. మరో ఉపాధ్యాయుడి వద్దకు వెళ్లి డబ్బుల కోసం అడిగారు. ఆ ఉపాధ్యాయుడు జరిగిన విషయంపై ఆరా తీశారు. అనుమానంతో ఆ అపరిచిత వ్యక్తికి ఫోన్ చేయగా.. స్పందించకపోవడంతో సైబర్ నేరగాళ్లు అని గుర్తించారు. వెంటనే ఉపాధ్యాయుడు తన కుమారుడికి ఫోన్ చేయగా.. తాను క్షేమంగానే ఉన్నానని చెప్పాడు. దీంతో తాను సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసపోయానంటూ ఆ ఉపాధ్యాయుడు కాశీబుగ్గ పోలీసులకు, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- ఇప్పటి వరకూ మీ ఫోన్ నెంబరుకు ఓటీపీ వస్తుందని, మీ ఆధార్ లింక్ చేయాలని.. మీ అకౌంట్ నెంబరు చెప్పండని, క్రెడిట్ కార్డు పిన్ మార్పిడి చేస్తున్నామని సైబర్ నేరగాళ్లు వివిధ అక్రమాలకు పాల్పడి రూ.లక్షలు కొల్లగొట్టడం చూశాం. కానీ కొత్తగా పోలీసులమని చెప్పి.. ఇలా మోసాలకు పాల్పడడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు వద్ద ప్రస్తావించగా.. తమకు బాధితుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. సైబర్‌క్రైమ్ కావడంతో వారే ఈ కేసును దర్యాప్తు చేస్తారని తెలిపారు.

అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు జమ్ము కుర్రోడు

- అండర్ -17 విభాగంలో ప్రేమ్‌కుమార్ ఎంపిక



ప్రేమ్‌కుమార్

నరసన్నపేట, సెప్టెంబరు 5: ఆ కుర్రోడుకి చిన్నతనం నుంచీ ఈత అంటే ఎంతో సరదా. పాఠశాలకు డుమ్మా కొట్టి మరీ.. గ్రామంలోని చెరువులో ఈత కొడుతూ ఆడుకునేవాడు. నేడు అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటనున్నాడు. నరసన్నపేట మండలం జమ్ము గ్రామానికి చెందిన టెంక ప్రేమ్‌కుమార్.. అండర్-17 విభాగంలో అంతర్జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రేమ్‌కుమార్ ఏడాది కిందట స్విమ్మింగ్‌లో యానాం స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. ఈజిప్టులో అక్టోబరు 10 నుంచి 13వరకూ యూనియన్ ఇంటర్నేషనల్ పెంటాథాన్ మోడరన్(యూఐపీఎం) పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు అండర్-17 విభాగంలో ప్రేమ్‌కుమార్‌ను ఎంపిక చేస్తూ.. ఇటీవల మెడరన్ పెంటాథాన్ ఫెడరేషన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పోటీల్లో పాల్గొనేందుకు పాస్‌పోర్టు ఉండాలని సూచించారు. కాగా.. ప్రేమ్‌కుమార్ తండ్రి రాజు.. పారిశుధ్య రిక్షా కార్మికుడిగా పనిచేస్తున్నారు. తమది పేద కుటుంబమని.. తమ కుమారుడు ఈజిప్టు వెళ్లేందుకు ఆర్థికంగా దాతలు సహకరించాలని రాజు కోరుతున్నారు. పాస్‌పోర్టు కోసం స్థానిక వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి గొద్దు చిట్టిబాబు చొరవ తీసుకొని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. ప్రేమ్‌కుమార్‌కు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని తెలిపారు.

మట్టి గణపతి.. మనసా స్మరామి





కంచిలిలో గంగానది మట్టితో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు

నేడే.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య'

- శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహణ
- పర్యావరణ హితమే లక్ష్యంగా మట్టి ప్రతిమల తయారీ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వినాయకచవితి పండగను పురస్కరించుకుని.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య' కార్యక్రమం శుక్రవారం జరగనుంది. పర్యావరణ హితంగా.. కాలుష్యరహితమే లక్ష్యంగా రేపటిపౌరులను భాగస్వామ్యం చేసేలా ఈ కార్యక్రమానికి 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' శ్రీకారం చుట్టింది. శుక్రవారం శ్రీకాకుళంలో అరసవల్లిరోడ్డు మార్గంలో మిల్లు జంక్షన్ వద్ద ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం నిర్వహణ ప్రారంభం కానుంది. కార్యక్రమంలో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులు ఉచితంగా పాల్గొనవచ్చు. విద్యార్థులకు బంకమట్టిని సరఫరా చేయడంతోపాటు వినాయక ప్రతిమను ఎలా తయారీ చేయాలో ముందుగానే శిక్షణ ఇస్తారు. అనంతరం శిక్షకుడు చెప్పినట్లు వినాయక ప్రతిమను తయారీచేసిన వారిని ఎంపిక చేస్తారు. ఆకర్షణీయమైన బహుమతులను అందజేస్తారు. ఈమేరకు గురువారం రాత్రి ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆంధ్రజ్యోతి ఏడీవీటీ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆసక్తిగల విద్యార్థులు తమపేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 99854 11066 నంబర్‌ను సంప్రదించాలి. ఇందులో పాల్గొనే విద్యార్థులు వాటర్ బాటిల్‌తో నీరు, పాత వస్త్రం తెచ్చుకోవాలి. ఈ కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావు వ్యవహరిస్తున్నారు.

- కంచిలిలో గంగానది మట్టితో వినాయకుడి విగ్రహాల తయారీ

(కంచిలి)

వినాయక చవితి.. హిందువుల తొలిపూజ. చిన్నారుల నుంచి పెద్దల వరకూ సందడిగా చేసుకునే పండుగ. శనివారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏకదంతుడు బహురూపాల్లో కొలువుదీరనున్నాడు. ఈ నేపథ్యంలో కళాకారులు మట్టితో విభిన్న రూపాల్లో వినాయక విగ్రహాలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణం దృష్ట్యా చాలామంది మట్టి ప్రతిమలకే ప్రాధాన్యమిస్తున్నారు. కంచిలిలో 20 ఏళ్ల నుంచీ వెస్ట్ బెంగాల్‌కు చెందిన కళాకారులు.. మట్టి ప్రతిమలు తయారుచేస్తున్నారు. మిద్నాపూర్‌కు చెందిన అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వెస్ట్ బెంగాల్‌లోని గంగానది నుంచి మట్టిని తెచ్చి ఆకర్షణీయంగా విగ్రహాలు రూపొందిస్తున్నారు. ఏటా వందల సంఖ్యలో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నామని అరుణ్‌కుమార్ తెలిపారు. 'దేవుడిని ఎంతో భక్తితో, పవిత్రంగా పూజిస్తాం. అందుకే విగ్రహాల తయారీకి అంతే పవిత్రమైన గంగానది మట్టిని తెస్తున్నా. ఈ మట్టితో చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు.


వినాయక ఉత్సవాలకు 1,302 దరఖాస్తులు: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 5: జిల్లాలో వినాయక ఉత్సవాల అనుమతుల కోసం 1302 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్‌లో గురువారం వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి అనుమతులు, ముందస్తు చర్యలు, నిమజ్జనం ఏర్పాట్లపై పలాస, టెక్కలి, శ్రీకాకుళం ఆర్డీవోలు, డీఎస్పీలు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని పిలుపునిచ్చారు. అధికారులంతా సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నిబంధనల మేరకు అనుమతి మంజూరు చేయాలన్నారు. డీఎస్పీలు వ్యక్తిగత పర్యవేక్షణ ద్వారా రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేసి నిమజ్జనం వివరాలను వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే కాలుష్య నియంత్రణ శాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

పూడిలంక రోడ్డుకు మోక్షం!

- రూ.3.40 కోట్లతో ప్రతిపాదనలు
- పలాస ఆర్డీవో పరిశీలన

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 5: వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక గ్రామస్థులను దశాబ్దాలుగా వేధిస్తున్న రహదారి సమస్యకు త్వరలో మోక్షం లభించనుంది. జిల్లాకు ఎప్పుడు తుఫాన్ వచ్చినా.. భారీ వర్షాలు కురిసినా.. అధికారుల దృష్టి అంతా పూడిలంక పైనే. ఈ గ్రామం చుట్టూ ఉప్పుటేరు ఉంది. తుఫాన్‌ల సమయంలో ఉప్పుటేరు ఉప్పొంగి ప్రవహించి.. రాకపోకలు స్తంభించిపోతాయి. ఆ సమయంలో గ్రామస్థులంతా బయటకు రాలేని పరిస్థితి. వారి బాగోగులు చూడడం అధికారులకు సైతం భారంగా మారుతోంది. ఈ సమస్య పరిష్కారం కావాలంటే గ్రామానికి పూర్తిస్థాయి రోడ్డు సదుపాయం కల్పించాలి. అయితే గతంలో టీడీపీ హయాంలో సుమారు కోటి రూపాయలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ పూర్తిస్థాయిలో పనులు కాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. హామీలు ఇచ్చినా ఈ రోడ్డు పనుల ఊసే లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రోడ్డు నిర్మాణంపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రహదారి నిర్మాణానికి రూ.3.40 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పీఆర్ఐ డీఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే శిరీష కూడా సిఫారసు లేఖ రాశారని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పూడిలంక రోడ్డును పలాస ఆర్డీవో భరత్ నాయక్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. పూడిలంక వాసులు రాకపోకల కోసం పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక గ్రామానికి వేసిన గ్రావెల్ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోవడంపై ఆరా తీశారు. మిగిలిన రోడ్డు నిర్మాణానికి కావలసిన నిధులపై డీఈ రామకృష్ణ నుంచి వివరాలు సేకరించారు. అలాగే కొట్టుకుపోయిన నడకదారిని పరిశీలించారు. ప్రస్తుతం పడవపైనే రాకపోకలు సాగిస్తున్నామని గ్రామస్థులు ఆర్డీవోకు తెలిపారు. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణానికి పూర్తిస్థాయి అంచనాలు రూపొందించాలని, ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో వెల్లడించారు. నిధులు మంజూరైతే పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మిస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బాల, డీటీ వి.గిరిరాజు, ఆర్ఐ పవిత్ర, ఇంజనీరింగ్ అధికారులు, వీఆర్‌వోలు ఉన్నారు.



కొట్టుకుపోయిన పూడిలంక నడకదారి



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్‌నాయక్

ప్రతిపాదనలు పంపించాం..

పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గత నెల 24న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రూ.3.40 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఆయన సానుకూలంగా స్పందించారు. నిధులు విడుదలైన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతాం. గతంలో టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు రూ.1.30 కోట్లు మంజూరు చేయగా.. అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ఆధ్వర్యంలో కొంతమేర రోడ్డు పనులు చేపట్టారు.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

స్వచ్ఛ సిక్కోలుగా అభివృద్ధి చేస్తా

- నూతన కమిషనర్ పీవీవీడీ ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రసాద్

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 5: శ్రీకాకుళం కార్పొరేషన్‌ను స్వచ్ఛ సిక్కోలుగా అభివృద్ధి చేస్తానని నూతన కమిషనర్ పీవీవీడీ ప్రసాద్ వెల్లడించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా విశాఖపట్నం జోన్-4 కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయనగరానికి చెందిన ప్రసాద్‌ను శ్రీకాకుళం నగరపాలక కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు.



పదిహేనేళ్ల ప్రయాణం

అక్కినేని నాగచైతన్య తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదిహేనేళ్లు అయింది. ఆయన నటించిన తొలి చిత్రం 'జోష్' 2009 సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ పదిహేనేళ్ల ప్రయాణంలో విలక్షణమైన పాత్రలు ఎన్నో పోషించి, మంచి నటుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ చిత్ర యూనిట్ ప్రత్యేకమైన పోస్టర్ విడుదల చేసింది. సముద్రం దగ్గర ఫిషింగ్ బోట్ మీద నిల్చుని చిరునవ్వు చిందిస్తున్న చైతు లుక్ ఆకట్టుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత.

ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం

డి.సురేశ్‌బాబు



తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరపున రూ.25 లక్షలు.. నిర్మాతల తరపున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరపున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరపున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరఫున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు

32వ సినిమా విడుదలకు ముహూర్తం



విభిన్న కథాంశాలు ఎన్నుకొని వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న నాని తన 32వ చిత్రం వివరాలు గురువారం ప్రకటించారు. 'హిట్ 3' చిత్రంలో తన లుక్‌ని, గ్లింప్స్‌ను విడుదల చేశారు. డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. సిగార్ తాగుతూ, కారు నడుపుతూ రక్తపు చేతులు, గొడ్డలితో ఫెరోషియస్‌గా కనిపించారు నాని. 'హిట్ 3'లో ఆయన అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 2025 వేసవి సందర్భంగా మే ఒకటిన సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. 'హిట్ 3' చిత్రానికి సాను జాన్ వర్గీస్ ఛాయాగ్రహణాన్ని, మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

వినోదాన్ని పంచే సినిమా



ఫరియా అబ్దుల్లా నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019 విడుదలై సూపర్ హిట్ అయిన 'మత్తు వదలరా' సినిమాకు సీక్వెల్. ఈ నెల 13న విడుదలవుతున్న సందర్భంగా ఫరియా మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా ఒక డిఫరెంట్ థ్రిల్లర్. ఎన్నో ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లతో కూడిన కథ ఇది. ఇందులో పాత్రధారుల కష్టాల నుంచే కామెడీ పుడుతుంది. ఈ సినిమాలో సన్నిధి అనే స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తాను. నాది యాక్షన్‌తో నిండిన పాత్ర. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. కాలభైరవ ఇచ్చిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ సినిమా మొదటి భాగం కంటే మరింత వినోదాన్ని పంచుతుంది. ప్రస్తుతం తిరువీర్‌తో ఓ ప్రేమకథలో నటిస్తున్నా. త్వరలోనే ఓ తమిళ చిత్రం కూడా మొదలవ్వబోతోంది" అని ఫరియా చెప్పారు.



ఇన్ ప్రోగ్రెస్

మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి

మంచు విష్ణు



తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాక్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

సంస్కృత టీచర్స్‌కు అంకితం



రచయిత, దర్శకుడు జనార్ధన మహర్షి 'శ్లోక' పేరుతో ఓ సంస్కృత చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాగిణి ద్వివేది ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని జనార్ధన మహర్షి కుమార్తెలు శ్రావణి, శర్వాణి నిర్మాతలు. ఈ సినిమా గురించి జనార్ధన మహర్షి వివరిస్తూ 'సినిమాలోని కీలకమైన రుద్రభూమి సన్నివేశాలను బెంగళూరు, మైసూర్‌లో చిత్రీకరించాం. దేశంలోని పురాతనమైన అనేక శ్మశానాలలో షూటింగ్ చేశాం. సంస్కృతంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనేక భారతీయ భాషల్లోకి అనువదిస్తాం. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మా చిత్రాన్ని సంస్కృత టీచర్స్‌కు అంకితం ఇస్తున్నాం' అని చెప్పారు. ఈ సినిమాలో తనికెళ్ల భరణి కీలక పాత్ర పోషిస్తున్నారు.

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



యువతరానికి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రోటీ కపడా రొమాన్స్' అక్టోబరు 4న విడుదల కానుంది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. సినిమాలో ప్రతి పాత్ర యూత్‌కు కనెక్ట్ అవుతుందనీ, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ప్రధాన బలాలు అని దర్శకుడు తెలిపారు. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనీ, అది ఏ రేంజ్ అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారనీ నిర్మాతలు చెప్పారు.


స్పీడ్‌గా..



గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవి నటించిన 'స్పీడ్ 220' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోలిద్దరూ పోటీ పడి నటించారనీ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా అలరించే విధంగా సినిమా ఉంటుందని దర్శకుడు హర్ష బేజాగం తెలిపారు. కె.ఫణి, ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు ఈ సినిమాను నిర్మించారు.









డమ్మీ బాంబులతో రెడ్‌ఫోర్స్ సిబ్బంది

● పట్టుకున్న మెరైన్ పోలీసులు



రెడ్‌ఫోర్స్ సిబ్బంది బ్యాగును తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీసులు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో చొరబడి పోలీసు శిక్షణ కేంద్రానికి డమ్మీ బాంబులతో వెళ్తున్న ముగ్గురు రెడ్‌ఫోర్స్ సిబ్బందిని మెరైన్ పోలీసులు పట్టుకున్నారు. సాగర్ కవచ్‌లో భాగంగా గత రెండు రోజులుగా సాగర తీరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మెరైన్, జిల్లా పోలీసులు పటిష్ఠ బందో బస్తు నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం శ్రీకాకుళం రూరల్ మండలం తండ్యాం వలస కూడలిలో ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి డమ్మీ బాంబులతో వెళ్తున్నారు. ఇదే సమయంలో శ్రీకాకుళం మెరైన్ సీఐ బోర ప్రసాదరావు తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తున్నారు. దీనిని గమనించిన ఆ ముగ్గురిలో ఒకరు వాహనం దిగిపోయి ముందుకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత వచ్చిన ఆ ఇద్దరిని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారిద్దరూ హిందీలో మాట్లాడుతుండడంతో అనుమానంతో చెక్ చేయగా వారి వద్ద నకిలీ బాంబులు గుర్తించారు. దీంతో విచారించగా సాగర్ కవచ్‌లో భాగంగా పోలీసు ట్రైనింగ్ కేంద్రంలో నకిలీ బాంబులు అమర్చేందుకు వెళ్తున్నామని, తాము రెడ్‌ఫోర్స్ సిబ్బంది అని చెప్పడంతో వారిని సీఐ పట్టుకుని.. శ్రీకాకుళం సాగర్ కవచ్ మోనటరింగ్ అధికారి, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందకు సమాచారం అందించారు. కాగా రెడ్‌ఫోర్స్ సిబ్బందిని పట్టుకున్న మెరైన్ సీఐ బోర ప్రసాదరావు, ఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సీలు నారాయణ, శ్యామలరావు, పీసీలు ప్రసాదరావు, రమేష్, మధులను విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, మెరైన్ ఎస్పీ వర్మ, ఏఎస్పీ మధుసూదనరావు ప్రత్యేకంగా అభినందించారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ



గణనాథుని విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ

పలాస: మట్టి గణనాథులకు పూజించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ(గ్లో) ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ గ్లో సంస్థ ద్వారా పలాస, విశాఖపట్నంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్నామని, అందరి ఇంట వినాయక పూజలు జరగాలని, అంతా సుఖసంతో షాలతో ఉండాలన్నదే తమ అభిమతమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, ఎం.నరేంద్ర, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, పెంట ఉదయ్‌శంకర్, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు. ● **వంశధార నీరు** శివారు భూములకు ఇప్పించ డంలో కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం టీడీపీ కార్యాలయంలో చిన్నబడాం రైతులు సత్కరించారు. పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు ఆధ్వ ర్యంలో రైతులు తరలివచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేయలేని పనిని గెలిచిన వెంటనే నెలరోజుల్లోనే నీరు ఇవ్వడం చరిత్రగా మిగిలిపోతుందని రైతులు అన్నారు. ● **కాశీబుగ్గ:** ప్రతీ ఒక్కరూ మట్టి వినాయకులను పూజిద్దామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం కాశీబుగ్గ రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న బంకేశ్వరి ఆలయం వద్ద 10 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాల వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో బంకేశ్వరి ఆలయ అధిపతి రామానందస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి



కాశీబుగ్గ: కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాశీబుగ్గ వెంకటజ్యోతి ఫిల్లింగ్ స్టేషన్ యజమానులు కేవీ రామకృష్ణ, గిరిధర్ కోరా రు. గురువారం సుమారు 300 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలకు పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు.

ఆధునిక వ్యవసాయంతో పంటల దిగుబడి

మెళియాపుట్టి: ఆధునిక విధానాల్లో వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాఖ ఏడీ లింగాల మధుబాబు అన్నారు. గురువారం ముకుందపురంలో పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రసాయక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. తద్వారా పంట ఆరోగ్యంగా ఉండడంతో పాటు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో దానకర్ణుడు, పలువురు రైతులు పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయాధికారి సునీత అన్నారు. గురువారం గోపాలపెంట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. పాముమడత, కుళ్లు తెగుళ్లు విస్తరించే అవకాశ మున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలంలో నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అప్పయ్యదొర సేవలు మరువలేనివి

కాశీబుగ్గ: దివంగత నేత మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్య దొర సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం కాశీబుగ్గలో అప్పయ్యదొర 11వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఉద్దానం అభివృద్ధికి, ఆఫ్‌షోర్ నిర్మాణానికి కృషి చేసిన వ్యక్తి అప్పయ్యదొర అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబురావు,లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి, వైసీపీ నేతలు సీదిరి అప్పలరాజు, హనుమంతు వెంకట్రావు దొర, రంగారావు, బుజ్జి తదితరులు కూడా అప్పయ్యదొరకు నివాళి అర్పించారు. ● **నందిగాం:** మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్య దొర వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీఎల్పీవో విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో రమణ

నందిగాం: పెద్దతామరాపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఫిర్యాదుపై డీఎల్పీవో ఐవీ రమణ గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన బొమ్మాళి సింహాచలం ఇటీవల వివిధ అంశాలపై డీపీవోకి ఫిర్యాదు చేశారు. చేపల చెరువుకు వేలం వేయకుండా రూ.60 వేలు సొంత ఖాతాకు జమచేసుకున్నారని, శివాలయానికి గ్రామస్థులందరూ కలిసి సీసీ రోడ్డు నిర్మిస్తే సర్పంచ్ భర్త రూ.2.50 లక్షలు దుర్వినియోగం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో డీపీవో ఆదేశాల మేరకు డీఎల్పీవో పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తమిరె సుధారాణి, ఫిర్యాదుదారు బొమ్మాళి సింహాచలం, గ్రామస్థులను విచారించి వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. విచారణ నివేదికను డీపీవోకి అందిస్తానని ఆయన తెలిపారు.

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధంచేయండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రముఖ ఆలయాలను కలుపుతూ కళింగ టెంపుల్ సర్క్యూట్ టూరిజంను అభివృద్ధి చేయాలని, అందుకు తగ్గ ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలో ప్రాజెక్టు ప్రగతిపై సంబంధిత శాఖలతో కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర పర్యాటక శాఖ ప్రసాదం పథకంలో భాగంగా కళింగ టెంపుల్ సర్క్యూట్ టూరిజం ఎంపికయ్యే లా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారం తీసుకుని స్పష్టమైన కార్యాచరణతో కేంద్ర నిధులు రాబట్టేం దుకు కృషి చేస్తామన్నారు. తొలి దశలో అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలను కలుపుతూ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేయాలన్నారు. గనగళ్లవానిపేటలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మిస్తున్న కాటేజీలు, వాటర్ స్పోర్ట్స్ పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళింగపట్నం బీచ్, పీజీ పేట మధ్య ప్యాసింజర్ జెట్టి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలతో పర్యాటక శాఖ ఎండీకి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కళింగపట్నం బీచ్‌లో గ్రోయిన్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీటీడీసీ ఈఈ కె.రమణ, ఏఈఈ పి.మదన్‌మోహన్, డీటీవో ఎన్.నారాయణరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ పొగిరి సుగుణాకరరావు, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకరరావు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసాదరావు పట్నాయక్, శ్రీకూర్మం ఆలయ ఈవో గురునాథరావు పాల్గొన్నారు.

'అమృత్‌భారత్' పనులు పూర్తి చేయాలి

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా శ్రీకాకుళం రోడ్డు, పలాస, నౌపడ, ఇచ్ఛాపురం స్టేషన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. వాల్తేరు డివిజన్లో శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన పనుల పురోగతిని సమీక్షించారు. అమృత్ భారత్‌లో భాగంగా టాయిలెట్లు, లిఫ్టులు, పరిశుభ్రత, ఉచిత వైఫై, స్థానిక ఉత్పత్తుల కోసం కియోస్క్‌లు, మెరుగైన ప్రయాణికుల సమాచార వ్యవస్థలు, దివ్యాంగులకు సౌకర్యాలపై ఆరా తీశారు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్‌ను మల్టీ మెడల్ స్టేషన్‌గా చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా కేంద్రమంత్రి ప్రస్తావించారు. అలాగే జిల్లాకు చెందిన మిగతా స్టేషన్లలో మౌలిక సదుపాయాలపై చర్చించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మీదుగా ప్రయాణిస్తున్న పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు శ్రీకాకుళం, పలాస స్టేషన్లలో హాల్ట్‌లు కల్పించాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శబరిమలకు ప్రత్యేక రైలు నడపాలని కోరారు. గుణుపూర్-నౌపడ రైల్వేలైన్‌లో ఉన్న పాతపట్నం, టెక్కలి స్టేషన్ అభివృద్ధికి చొరవ తీసుకోవాలని కేంద్రమంత్రి సూచించారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం



టెక్కలి: శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

కొత్తూరు: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొత్తూరు మండల వ్యాప్తంగా సాయంత్రం ఎడతెరిపి లేని వర్షంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. ప్రధాన రహ దారులపై గోతుల్లో చేరిన నీటితో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న మండపాలకు వర్షం ఆటంకం కలిగించింది. ● **పోలాకి:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రత ఉండగా సాయంత్రం అకస్మాత్తుగా వాతావరణంలో మార్పు సంభ వించి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఇబ్బంది పడగా వినాయక మండపాల తయారీకి ఆటంకం కలిగింది. ● **టెక్కలి:** టెక్కలిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. టెక్కలి శ్రీనివాస్ నగర్‌లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే పలు వీధు ల్లో రోడ్లపైకి మురుగునీరు చేరి ప్రజలు రాకపోకలకు ఇక్కట్లకు గురయ్యారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

సంతబొమ్మాళి: గ్రామాల్లో రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యే కాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం బోరుభద్రలో వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇష్టానుసారంగా రోడ్లపై చెత్తాచెదారాలు వేయడం వల్ల పారిశుధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. పారిశుధ్య పనులపై ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఎంపీడీవో ప్రేమలీల, ఈవోపీఆర్డీ గోపాలరావు, సర్పంచ్ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: విష జ్వరాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్ అన్నారు. గురువారం మాకివలస పీహెచ్‌సీని తనిఖీ చేశారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి జ్వరపీడితులను గుర్తించి వైద్య సేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో పారామెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, వైద్యులు విజయకుమార్, శిరీష పాల్గొన్నారు.

ఇళ్ల కాలనీలను పూర్తిచేయండి

జలుమూరు: మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల కాలనీల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జె.నాగలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఇంటింటి సర్వే చేసి పనులు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం

టెక్కలి: చాకిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తాటిపోలమ్మ యువజన సేవా సంఘం ఆధ్వ ర్యంలో గురువారం మండలస్థాయి క్విజ్ పోటీ నిర్వహించారు. సీతాపురం, రావివలస జట్లు వరుసగా రెండు బహుమతులు పొందాయి. బహుమతులను ఎంఈవోలు డి.తులసీరావు, చిన్నారావు అందజేశారు. హెచ్ఎం ఎం.అనూరాధ, మాజీ సర్పంచ్ పంగ తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో విద్యార్థిని ప్రతిభ



కర్రి చందును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

ఈదులవలస(పోలాకి): తిరుపతిలో ఈనెల ఒకటి, రెండు తేదీల్లో జరిగిన తైక్వాండో పోటీల్లో ఈదులవలస మోడల్ కళాశాల విద్యార్థిని కర్రి చందు కాంస్య పతకం సాధించినట్టు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, పీడీ. ఎం.నీలం తెలిపారు. ఈ మేరకు గురువారం సదరు విద్యార్థినిని పాఠశాలలో అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నరసన్నపేట: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. నవజాతి శిశువుకు తల్లిపాలివ్వడం ఎంతో శ్రేష్ఠమన్నారు. గర్భిణులు వైద్యాధికారుల సూచనలు పాటించి ఆసుపత్రిలో కాన్పులకు రావాలన్నారు. మాజీ సర్పంచ్ జల్లు చంద్రమౌళి, సూపర్‌వైజర్ హేమ పాల్గొన్నారు. ● **జలుమూరు:** పిల్లలకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని జలుమూరు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మావతి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపరువైజర్ సీతారత్నం పాల్గొన్నారు.

కిడ్నీ మహమ్మారి మూలకారణంపై ప్రత్యేక దృష్టి



ఎమ్మెల్యే అశోక్‌తో మాట్లాడుతున్న కిడ్నీ పరిశోధనా బృందం

కవిటి: ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో మూలకారణం తెలుసు కునేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని కొలంబియా యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త లెక్స్‌వెన్‌గేస్ అన్నారు. బొరివంక గ్రామంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను గురువారం బృంద సభ్యులు కలిసి పరిశోధనల విధానాన్ని వివరించారు. ఉద్దానం ప్రాంతంలో ఈ వ్యాధి ప్రబలడానికి ప్రధా న కారణం ఏంటనే విషయాన్ని పూర్తిస్థాయిలో పరిశోధన చేస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల రక్తనమూనాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే వ్యాధిగ్రస్థులు తీసుకొనే ఆహారం, అలవాట్లతోపాటు మందుల వివరాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రంలో ప్రత్యేకంగా ఉన్న పరికరాలతో పరిశోధనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామస్థాయిలో చేపట్టే ఈ పరిశోధనలకు కొంత సమయం పడుతుందని బృందం వైద్యులు జి.బాలాజీ, డేవిడ్ అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యనారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం: స్థానిక విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మండల పరిధి లోని పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగడల, గోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాళి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసు పురం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనిం చాలని కోరారు.

బోధనా సామగ్రితో విద్యార్థుల్లో నైపుణ్యం

హరిపురం: బోధనా సామగ్రిని వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించవచ్చని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రాధాకృష్ణాపురం ఏపీఆర్ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్, బోధనా సామగ్రిని గురువారం ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రవాస భారతీయుడైన బాపట్లకు చెందిన గోరంట్ల వాసుబాబు విద్యాభివృద్ధికి వీటిని అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 187 పాఠశాలలకు సామగ్రిని అందిర గా వాటిలో ఈ పాఠశాల ఎంపిక చేయడం హర్షణీయమని, దీనికి కృషి చేసిన ఎమ్మెల్యేకి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని సత్కరించారు. అనంతరం సిద్ధిగాంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణమూర్తి, తిరుమల రావు, హరికృష్ణ, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, మండల లచ్చయ్య, కోనారి తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అభివృద్ధి

చొర్లంగి(ఎల్.ఎన్.పేట): గిరిజన గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, వీటిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు తెలిపారు. ప్రధానమంత్రి జనజాతి ఆది వాసీ న్యాయసహా అభియాన్ యోజనపై గురువారం గురువారం చొర్లంగి గ్రామంలో గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలతో పాటు సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నాయని, అయితే వీటిపై అవగాహన లేకపోవడంతోనే అభివృద్ధి జరగడం లేదన్నారు. అలాంటి గిరిజన గ్రామాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైవీ పద్మావతి, పంచాయతీ అధికారి ఐ.పద్మజ, ఆర్ఐ ఎస్.గవరయ్య, సర్పంచ్ ఎస్.గంగమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో అలికాం-బత్తిలి రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తున్న వారు గ్రామ పారిశుధ్యానికి సహకరించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాదరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చిరు వ్యాపారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను రోడ్లపై వేయవద్దని, దీనివల్ల గ్రామ ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. చెత్త బుట్టల్లో వేసి పారిశుధ్య పనివారు వచ్చినప్పుడు బండ్లకు అందించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ● **టెక్కలి:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టలని డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. గురువారం టెక్కలి గ్రామపంచా యతీ కార్యాలయంలో మండల పరిషత్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలువల్లోని పూడికలు తొలగించడం, క్లోరినేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ఎక్కడా మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీ బాయి, ఏపీవో బగాది ప్రసాద రావు, టెక్కలి ఈవో జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. ● గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తూరు:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని, దీనిపై దృష్టి సారించాలని ఎంపీడీవో పావని అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వ్యాపారులు, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి మాట్లాడుతూ.. కొత్తూరును స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని దీనికి ప్రతి ఒక్కరూ సహక రించాలని ముందుకు అడుగులు వేస్తున్నామని, ప్రతి ఒక్కరు సహక రించాలని కోరారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దన్నారు. ఈవోపీఆర్డీ బీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల్లో ముమ్మర తనిఖీ

గుప్పెడుపేట(పోలాకి): సాగరతీర ప్రాంతాల్లో సాగర్ కవచ్‌లో భాగంగా గుప్పెడుపేట, రాజారాంపురం, కొత్తరేవు, గుల్లవానిపేట, గ్రామాల్లో గురువారం పోలీసులు వాహనాలను, వ్యక్తులను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి అవకాశం



మాట్లాడుతున్న అంకమ్మ చౌదరి

గుజరాతీపేట: జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి అవకాశాలున్నాయని, దీనికి అసోసి యేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి అన్నారు. గురువారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ.. కోడి రామ్మూర్తి స్టేడియంలో కోర్టులు అందుబాటులోకి వస్తే జాతీయ స్థాయి, సౌత్ జోన్ పోటీలు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ జిల్లాలో మరో బ్యాడ్మింటన్ సంఘం పుట్టుకొచ్చినట్టు మా దృష్టికి వచ్చిందని, ఇలాంటి బోగస్ సంఘా లను క్రీడాకారులు నమ్మవద్దన్నారు. బ్యాడ్మింటన్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) గుర్తించిన ఏపీబీఏ అనుసంధానంగా ఉన్న సంఘాన్ని గుర్తిస్తు న్నట్టు తెలిపారు. అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి ప్రసాద్, ఎం.రత్నాజీ, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

జలుమూరు: గొటివాడ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్ వరి పొలంలో బోల్తా పడింది. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పర్లాం ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి అనుమ తులు లేకుండా రాత్రివేళ అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇందులో భాగంగా పర్లాం ఇసుక ర్యాంపు నుంచి రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పలువురు ఇసుకను తరలిస్తుండగా అదుపు తప్పి గొటివాడ సమీపంలో బోల్తా పడింది. అప్రమత్తమైన డ్రైవర్ తెల్లవారే సరికి ట్రాక్టర్‌ను ఎత్తివేసి ఆ ప్రాంతంలో ఏమీ లేకుండా చేశారు. దీనిపై ఎస్.ఐ అశోక్‌బాబు వద్ద ప్రస్తావించగా గొటివాడ సమీపంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడినట్లు సమాచారం వచ్చిందని, ఘటనా స్థలానికి వెళ్లే సరికి అక్కడ ట్రాక్టరు లేదన్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు.


శ్రీకాకుళం రూరల్: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే


ఆమదాలవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్


లావేరు: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


నరసన్నపేట: సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


కవిటి: ఎంఈవోను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్


హిరమండలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


హరిపురం: బీఎస్‌పురం పాఠశాల ఆవరణలో సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష


సోంపేట: కొర్లాం జూనియర్ కళాశాలలో..

ఉత్తమ స్థానం ఉపాధ్యాయులదే

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ● జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులదే సమాజంలో ఉత్తమ స్థానమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సింగుపురంలోని కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యా దినోత్సవం పురస్కరించుకుని ఉపాధ్యాయినులను కేంద్ర మంత్రితో పాటు ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనన్నారు. ఉపాధ్యాయుడి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆ రంగానికే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు.

అలాగే కిష్టప్పపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవంలో పలువురు ఉపాధ్యాయులను ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించారు. టీడీపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

కవిటి: బావి భారత పౌరులను తయారు చేసే సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బొరివంక గ్రామంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురు ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ నర్తు రామారావు కలిసి ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఈవో ధనుంజయ, టీడీపీ నేతలు రమేష్, .కృష్ణారావు, విజయకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిదే ఉత్తమ స్థానం

ఆమదాలవలస: సమాజంలో ఉపాధ్యాయుడుదే ఉన్నతమైన స్థానమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రమణమ్మ, రమామణి, జామి నాగరాజును సన్మానించారు. జడ్పీటీసీ బెండి గోవిందరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** సమాజంలో అన్ని రంగాల్లో గుర్తింపు పొందిన వ్యక్తుల కంటే విద్యతో పాటు వివిధ రంగాల్లో తీర్చిదిద్దిన గురువు ప్రపంచం ఉన్నంతవరకు చిరస్మరణీయులుగా నిలుస్తారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. చిగురువలస ప్రభుత్వ పాఠశాల వద్ద, మండల కేంద్రంలోని ఎంఆర్సీ వద్ద ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి నాయకులు పేడాడ రామ్మోహన్‌రావు, ఎండ రామారావు, పల్లి రాము, ఎంపీడీవో, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువుతోనే సమాజాభివృద్ధి

లావేరు: గురువుతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే వ్యవసాయ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్ కుమార్, తహసీల్దార్ వై.జోగారావు, ఎంఈవోలు ఈశ్వరరావు, మురళీకృష్ణ, కూటమి నాయకులు ముప్పిడి సురేష్, ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయుడునేనని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. గురువారం స్థానిక అదర్శ పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీ కాయల రమణ, మండల ప్రత్యేకాహ్వానితుడు వెంకటరమణ, కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, కంచరాన సూరన్నాయుడు, ఎంపీడీవో నిశ్చల, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ రూపశిల్పి ఉపాధ్యాయుడు

నరసన్నపేట/పోలాకి/జలుమూరు: సమాజ రూపశిల్పి ఉపాధ్యాయుడు అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఈవోలు, వివిధశాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దిక్సూచికలు ఉపాధ్యాయులు

పాతపట్నం/హిరమండలం: ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచికలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం, హిరమండలంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయ లోకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్గదర్శకుడని, ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులను సత్ప్రవర్తకులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సర్వేపల్లి ఆదర్శనీయుడు

హరిపురం: ఉపాధ్యాయ లోకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలో ఉపాధ్యాయ వేడుకల్లో గురువారం ఆమె పాల్గొన్నారు. ఏపీఆర్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మిని ఎమ్మెల్యే సన్మానించారు. బీఎస్‌పురం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో..


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో విక్రమ సింహపురి వర్సిటీ మాజీ వీసీని సన్మానిస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: ఎంఈవో కార్యాలయంలో..


పలాస రూరల్: బొడ్డపాడు హైస్కూల్‌లో..


ఎల్ఎన్ పేట: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు


మందస: ఎంఈవో కార్యాలయం వద్ద..


కొత్తూరు: రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు, నేతలు


జలుమూరు (సారవకోట): సారవకోట ఎంపీడీవో కార్యాలయంలో విద్యార్థుల ప్రదర్శన

గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

ఎచ్చెర్ల: నాగావళి నదిలో పొన్నాడ వద్ద అదే గ్రామానికి చెందిన అంపోలు అప్పారావు బుధవారం గల్లంతై.. గురువారం శ్రీకాకుళం రూరల్ మండలం పెద గనగళ్లవానిపేట వద్ద సముద్రతీరంలో శవమై కనిపించాడు. ఈయన వృత్తిలో భాగంగా బట్టలు ఉతికేందుకు వెళ్లి బండరాయి చుట్టూ ఉన్న ఇసుక మేటలు తొలగించి బయటకు తీసే క్రమంలో గల్లంతయ్యాడు. కాగా అప్పారావు మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీకాకుళం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వరం కాలనీలో చోరీ

ఎచ్చెర్ల: ఫరీద్‌పేటకు సమీపంలోని కంటిభక్తుల సత్యలక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి పై అంతస్తులో ఉన్న ఈమె తన ఇంటికి రెండు నెలల కిందట తాళాలు వేసి ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతానికి వెళ్లింది. అయితే ఇదే ఇంటి సెల్లార్ భాగంలో పని చేస్తున్న సైట్ ఇంజనీర్ సింహాద్రి హర్షవర్ధన్ చోరీ జరిగినట్టు గుర్తించి బుధవారం ఇంటి యజమానురాలు సత్యలక్ష్మి సమాచారం అందించాడు. ఆమె అనుమతితో ఇంట్లోకి వెళ్లి హర్షవర్ధన్ పరిశీలించగా.. 2.5 కిలోల వెండి, గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఇ.తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఎంపీడీవోకు జడ్పీ సీఈవో గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఇటీవల పాల్గొనే సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో ఎంపీడీవో హాజరుకాకపోవడంపై షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆ షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

గంజాయి కేసులో సాగుతున్న విచారణ

శ్రీకాకుళం క్రైం: గంజాయి నియంత్రణే ధ్యేయంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు చేపట్టిన విచారణ కొనసాగుతోంది. బుధవారం తొమ్మిది మంది గంజాయి మత్తు బాధితులను అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ పోలీసులు.. గురువారం రాత్రి మరో ఇద్దరు కీలకమైన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ కేసులో గంజాయి అక్రమ రవాణాదారులను జల్లెడవేసి పట్టుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే 11 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండడంతో ఈ కేసుతో సంబంధం ఉన్న వారంతా అరెస్టు కావడం తప్పదని పోలీసులు చెబుతున్నారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు

కవిటి: గ్రామస్థాయిలో ప్రోటోకాల్ పాటించడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చకు తీసుకువచ్చారు. ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వ కార్యక్రమాలకు పిలిచి వెంటనే వాయిదా పడిందని, లేకుండే మేము వెళ్లేసరికి కార్యక్రమాన్ని ముగింపు చేస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వకపోగా.. కనీసం సమాచారం ఇవ్వడం మానేశారని సభలో బెలగాం ఎంపీటీసీ ప్రస్తావించారు. అర్హులైన వారికి పింఛన్లు నిలిపివేయడంతో వారంతా ఇబ్బందిపడుతున్నారని బెజ్జిపుట్టుగ సర్పంచ్ నారాయణస్వామి, ఎంపీటీసీ గోపయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

అరసవల్లి: పర్యావరణానికి మేలు చేకూర్చే మట్టి విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో 30 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్, సూర్యమహల్ జంక్షన్, రామలక్ష్మణ, డే అండ్ నైట్, పాత బస్టాండ్, 80 అడుగుల రోడ్డు జంక్షన్, బలగ జంక్షన్‌తో పాటు రూరల్ పరిధిలోని సింగుపురం, సిలగాం సింగువలస, గారలోని శ్రీకూర్మం, గార, కళింగపట్నం తదితర ప్రాంతాల్లో ఈ మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ఈ విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

11న అప్రంటీస్ మేళా

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో ఎనిమిది ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు సంబంధిత ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డుతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. అరబిందో, నాగార్జున అగ్రికెమ్, శ్యాంపిస్టన్స్, స్మార్ట్‌కమ్, వరుణ్ మోటార్స్ తదితర కంపెనీలు హాజరవుతున్నాయని, ఆసక్తి గలవారు హాజరుకాలని కోరారు.

జాతీయస్థాయిలో రాణించాలి

శ్రీకాకులం రూరల్: ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన గార మండలం ఆడవరం గ్రామానికి చెందిన గుజ్జల వర్షిత, బూరవెల్లి గ్రామానికి చెందిన దుబ్బ హేమశ్రీలను ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. ఈ మేరకు గురువారం కిష్టపురం గ్రామంలో వారు ఎమెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా వర్షిత సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో మూడు బంగారు పతకాలు, హేమశ్రీ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.

చొరబాట్లు అడ్డుకునేందుకే సాగర్ కవచ్

శ్రీకాకుళం క్రైం/గార/సోంపేట: సాగర్ కవచ్ బందోబస్తులో భాగంగా గురువారం జిల్లాలో నిర్వహిస్తున్న చెక్‌పోస్ట్ విధులను మెరైన్ ఏఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు పరిశీలించారు. ఈ మేరకు వాడాడ, కిల్లిపాలెం, గార మండలంలోని కళింగపట్నం ప్రాంతాల్లో ఏఎస్పీ పర్యటించి సాగర్ కవచ్ గస్తీ, వాహనాల తనిఖీలపై తీసుకుంటున్న చర్యలను మెరైన్ సీఐ బోర ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. సముద్ర తీరం మీదుగా దేశంలోకి ఎటువంటి చొరబాట్లు జరగకుండా ఉండేందుకు ఏటా సాగర్ కవచ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం బారువ, భావనపాడు చెక్ పోస్టులను పరిశీలించారు. హెచ్‌సీ నారాయణరావు, పీసీ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ఆక్రమణలపై విచారణ

పొందూరు: రాపాక గ్రామ సమీపంలో 332 సర్వే నెంబరులో ఆక్రమణ జరుగుతున్నట్టు కలెక్టర్ గ్రీవెన్సులో అదే గ్రామానికి చెందిన కొంచాడ సూరీడు ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. 331 సర్వే నెంబరు జిరాయితీని అనుకుని 332 సర్వే నెంబరు ఉందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. 332లో 2006లో రాపాక గ్రామానికి చెందిన సంచాన పాపమ్మ, సంచాన నీలమ్మలకు, సంచాన భవానీలకు 40 సెంట్ల చొప్పున ప్రభుత్వం డీ-పట్టా ఇచ్చినట్టు విచారణ అధికారులకు ఆధారాలు చూపించారు. ఎటువంటి నిర్మాణాలు చేపట్టడం లేదని, పొలాన్ని చదును చేసుకుంటున్నట్టు పట్టాదారులు తెలిపారు. డీ-పట్టా భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు వీఆర్‌వో రేవతీరావు, సర్వేయర్ తెలిపారు.

వరదల విలయంపై సైకత శిల్పం



ఆమదాలవలస: ప్రకృతి విలయతాండవం చేయడంతో విజయవాడ నగరం వరదలతో నీట మునిగింది. వరదలతో భారీగా ఆస్తులు నష్టపోగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపైగా జులకొల్లివలస ప్రాంతానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ గురువారం సైకత శిల్పం రూపొందించారు. సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఫిడే మాస్టర్‌గా సేతు మాధవ్

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాకు చెందిన చదరంగం క్రీడాకారుడు ఎల్లుమహంతి సేతు మాదవ్ ఫిడే మాస్టర్‌గా అర్హత పొందింది. 45 రోజులుగా ఫ్రాన్స్‌లో వివిధ టోర్నమెంట్లలో గ్రాండ్ మాస్టర్స్, ఇంటర్నేషనల్ మాస్టర్స్‌తో పలువురు ప్రపంచ స్థాయి క్రీడాకారులతో 1900 రేటింగ్ పాయింట్లతో బరిలో దిగిన సేతు మాధవ్ వివిధ టోర్నమెంట్లలో తలపడి 2311 పాయింట్లు సాధించి ఫిడే మాస్టర్ టైటిల్ హోదా సాధించాడు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు వద్ద మెలుకువలు నేర్చుకున్నాడు. ఈ సందర్భంగా విశాఖకు చేరుకున్న మాధవ్‌ను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిశోర్, శ్రీకాంత్ నాథ్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట: విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్టు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని, వారి భవిష్యత్ పూర్తిగా నాశనమయ్యే పరిస్థితి ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రాగోలులో గల జెమ్స్ కళాశాలలో యాంటీర్యాగింగ్ చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు పోతుందన్నారు. విలువైన జీవితాన్ని నాసనం చేసుకోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్, జెమ్స్ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు


త్రినాథ మాస్టారును సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకు లని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయమైన ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలసి పూల మాలను వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రిటైర్డు ఉపాధ్యాయులు దంత త్రినాథరావును సత్కరించారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ అంబటి కృష్ణారావు, దేశిల్ల మల్లిబాబు, ఎం.నర్సింహమూర్తి, రెల్ల సురేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.నారాయణలో ఉపాధ్యాయ దినోత్సవం


పాఠశాల డైరెక్టర్ రోహిణీ శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హరిపురం: కుంటికోటలోని కె.నారాయణ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం డైరెక్టర్ గుంట రోహిణీ శంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడేనన్నారు. అనంతరం డైరెక్టర్ రోహిణీ శంకర్‌ను, ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

38 కిలోల చాక్లెట్లతో గణపతి విగ్రహం



గార: అంపోలు గ్రామానికి చెందిన లాలుప్రసాద్ 38 కిలోల చాక్లెట్లతో గణపతి విగ్రహాన్ని రూపొందించాడు. సుమారు 15 రోజులు శ్రమించి ఈ విగ్రహాన్ని రూపొందించినట్టు ప్రసాద్ తెలిపారు. గతంలో ఐస్‌క్రీమ్ పుల్లలతో గణపతి విగ్రహాన్ని తయారు చేసినట్టు తెలిపారు. ఈ చాక్లెట్ గణపతి చూపరులను ఆకట్టుకుంది.

డీసీసీబీ మహాజన సభ వాయిదా

అరసవల్లి: జిల్లా కేంద్ర సహకా బ్యాంకు వార్షిక మహాజన సభ ఈ నెల 6న నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసినట్టు సీఈవో డి.వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట: సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో పలాసపురం, లక్కవరం, బెంకిలి, జింకిభద్ర తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ పలాస పి.యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

● **పొందూరు:** లోలుగు విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ బయ్యన్నాయుడు, ఏఈ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా ఫీడర్ పరిధిలోని రాపాక, వీఆర్‌గూడేం, కోటిపల్లి, కృష్ణాపురం గ్రామాలకు ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

● **ఎచ్చెర్ల:** ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫరీద్‌పేట ఫీడర్, ఫరీద్‌పేట, ఎస్ఎం పురం, లింగాలపేట, కేశవరావుపేట, రాజీవ్‌నగర్ కాలనీలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బయ్యన్నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా చెట్ల కొమ్మలు తొలగించేందుకు, ఇతర మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

క్రమశిక్షణ లోపిస్తే చర్యలు

ఆమదాలవలస: ప్రభుత్వ ఉద్యోగులు పూర్తిగా జవాబుదారీతనంతో ఉండాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని మోనింగివారివీధి 1, 2 వార్డు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల గైర్హాజరు, రికార్డుల నిర్వహణ లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మారకపోతే చర్యలు తప్పవన్నారు. విధులకు హాజరైన తర్వాత బయటకు వెళ్లాలంటే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. తనిఖీలో ఇన్‌చార్జి కమిషనర్ సృజన తదితరులు ఉన్నారు.

వర్తక సంఘ అధ్యక్షుడిగా దొరబాబు

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్‌లో ఉన్న వర్తకులందరూ గురువారం సమావేశమై వర్తక సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వర్తక సంఘ అధ్యక్షుడిగా ఎండ దొరబాబు, ఉపాధ్యక్షుడిగా అదపాక రామస్వామి, కార్యదర్శిగా పాతిన రామారావు, సంయుక్త కార్యదర్శిగా గుడ్ల శ్రీనివాసరావు, అగతముడి కిరణ్‌కుమారలను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇటీవల జాతీయ స్థాయిలో ఎన్‌సీఈటీ -2024 పరీక్షకు హాజరై అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ బీఆర్‌ఏయూ డాట్ ఈడీయూ డాట్‌ఇన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఎస్సీ బీఈడీ (ఎంపీసీ), బీఏ బీఈడీ (హెచ్‌ఈపీ) కోర్సుల్లో 50 సీట్లు వంతున ఉన్నాయని చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఓసీ, బీసీ అభ్యర్థులకు 45 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం కనీసం ఉండాలన్నారు.

నాక్ బృందం పరిశీలన

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో గత రెండు రోజులుగా నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) న్యూ ఢిల్లీ బృందం సందర్శించింది. కళాశాలలో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల అర్హతలు, విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి, ల్యాబ్‌ల నిర్వహణను పరిశీలించారు. ఈ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ కేఈవీ నాగోజీ కళాశాలకు సంబంధించి సమాచారాన్ని వివరించారు.